www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 5 ఆగస్టు 2025
5
ఏలూరు

చీరవెల్లిలో విషాదం
జ్వరంతో ఐదేళ్ల చిన్నారి మృతి

సహస్ర (ఫైల్)

ప్రజాశక్తి - కుక్కునూరు
మండలంలోని చీరవెల్లి గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఐదు సంవత్సరాల యర్నం సహస్ర జ్వరంతో మూడు రోజులుగా భద్రాచలం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ, ఆ తర్వాత ఖమ్మం ఆసుపత్రిలో మృతిచెందింది. ఈరోజు తన పుట్టినరోజు కావడంతో ఆసుపత్రిలోనే చేయడానికి సిద్ధమవుతున్న వేళ ఈ విషాధ ఘటన చోటుచేసుకుంది. ఈ సంవత్సరం కుక్కునూరు ప్రయివేట్ స్కూల్లో చేరి ఆనందంగా ఉన్న సమయంలో ఈ దుర్ఘటన జరగడం గ్రామస్తులను కలచివేసింది. సహస్ర పుట్టినరోజు కోసం ఆన్‌లైన్‌లో బుక్ చేసిన బట్టలను ఆమె దహన కార్యక్రమానికి ఉపయోగించాల్సి రావడం కుటుంబ సభ్యులను, గ్రామస్తులను తీవ్ర శోకంలో ముంచెత్తింది.

ఆక్వాపై ట్రంప్ పిడుగు..!

రెండు రోజుల్లో కిలోకు రూ.30 నుంచి రూ.40 వరకూ తగ్గిన రొయ్య ధరలు
టన్నుకు రూ.40 వేలు నష్టం
మరోపక్క విద్యుత్ బిల్లుల భారంతో సతమతం
ఏడాదికి ఎకరాకు రూ.2 లక్షల వరకూ నష్టం
లబోదిబోమంటున్న రైతులు

ప్రజాశక్తి - భీమవరం
కొంతకాలంగా ఆక్వా సాగు పరిస్థితి అంతంతమాత్రంగానే ఉంది. నాణ్యమైన సీడ్ దొరకకపోవడం, ఫీడ్, సీడ్ ధరలు విద్యుత్ ఛార్జీలు పెరిగిపోవడం, వైరస్ ప్రభావం, సాగు వ్యయం రెట్టింపు వంటి వాటితోపాటు రొయ్య ధరను ఎగుమతిదారులు సిండికేటయ్యి తగ్గించడం, తూకంలో మోసం వంటి సమస్యలతో ఆక్వా రైతులు సతమతమవుతున్నారు. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్ నుంచి దిగుమతులపై సుంకం పెంచడం పిడుగుపాటులా మారింది. ప్రతియేటా ఈ ప్రాంతంలో నాలుగు లక్షల టన్నుల రొయ్యలు ఉత్పత్తి అవుతున్నాయి. దీనిలో సుమారు 3.5 లక్షల టన్నుల వరకు విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. భారత్ నుంచి విదేశాలకు ఎగుమతి అవుతున్న మాంసాహార ఉత్పత్తుల్లో రొయ్యలది మూడో స్థానం. ఆక్వా ఉత్పత్తుల ఎగుమతుల్లో రాష్ట్రంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాదే సింహభాగం. మొత్తంగా రూ.18 వేల కోట్ల వ్యాపారంలో విదేశీ లావాదేవీల వాటానే అధికంగా ఉంది. అమెరికా ప్రకటించిన 25 శాతం సుంకం పూర్తిస్థాయిలో అమలైతే తాము ఆక్వా సాగు చేపట్టలేమని ఆక్వా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ పరిస్థితిని అర్థం చేసుకుని కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకుని రైతులపై సుంకాల భారం లేకుండా చేయాలని ఆక్వా రైతులు కోరుతున్నారు. విదేశీ ఎగుమతులను ప్రోత్సహించడానికి కేంద్రం రాయితీ ఇవ్వాలి, లేదా అమెరికాపై ఒత్తిడి చేసి సుంకం తగ్గించేలా చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రస్తుతం ఎపిలో రొయ్యల సాగు చేస్తున్న రైతులు గడిచిన రెండు రోజుల నుంచి రొయ్య ధరలు తగ్గుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాతోపాటు తూర్పుగోదావరి, కృష్ణా, నెల్లూరు జిల్లాల రొయ్యల రైతులు బిక్కుబిక్కుమంటున్నారు. ఎందుకంటే ఒక్కసారిగా రొయ్యల ధరలు కిలో రూ.30 నుంచి రూ.40కి తగ్గిపోయాయి. ఇదే అదనుగా ప్రాసెసింగ్ యూనిట్లు, ఎక్స్‌పోర్ట్ ఏజెన్సీలు, మధ్యవర్తుల రొయ్యల కొనుగోలుకు రకరకాల మెలికలు పెడుతున్నారు.

టన్నుకు రూ.40 వేలు నష్టం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 2.90 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తున్నారు. దీనిలో సుమారు సుమారు 1.10 లక్షల ఎకరాల్లో రొయ్యల సాగు ఉంది. ఈ సాగులో 98 శాతం అమెరికా, చైనా, దుబాయ్ వంటి దేశాలకు ఎగుమతి చేస్తుంటారు. ప్రస్తుతం ఆక్వారంగ పరిస్థితులు తలకిందులయ్యాయి. మూడు రోజుల కిందటి వరకు వంద కౌంట్ రొయ్యలు కిలో రూ.270 ఉంటే, ఇప్పుడు రూ.230గా ఉంది. 60 కౌంట్ ధర రూ.340 ఉండగా, తాజాగా రూ.210కి పడిపోయాయి. ప్రతి కౌంటింగ్‌కూ రూ.30 నుంచి రూ.40 తగ్గుదల నమోదైంది. దీన్నిబట్టి చూస్తే సాగుదారులు టన్నుకు రూ.40 వేల వరకు నష్టపోతున్నారు. పంట చేతికందే దశలో ఒక్కసారిగా ధరలు పడిపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఈ పరిస్థితి ఎంతకాలం ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. అనుబంధ పరిశ్రమలపైనా ఈ ప్రభావం పడుతోంది. ఆక్వాను నమ్ముకుని ఏర్పడిన అనుబంధ రంగాలపైనా ఈ ఒడిదుడుకుల ప్రభావం తీవ్రంగా పడనుంది.

ముడిసరుకు ధరలు తగ్గినప్పటికీ ఫీడ్, సీడ్ ధరలు అధికంగా ఉండడంతో సాగు వ్యయం విపరీతంగా పెరిగి గత ఆరు నెలల నుంచి ఆక్వా రైతులు కష్టనష్టాల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. ఈ క్రమంలో ట్రంప్ నిర్ణయం ఆక్వా రైతులను కోలుకోలేని దెబ్బతీసింది. రొయ్యల సాగులో వంద కౌంట్ రావడానికి రూ.230 నుంచి రూ.240 వరకు ఖర్చవుతోంది. ఇది కూడా చెరువులో వేసిన పిల్ల కనీసం 80 శాతం పెరిగితే ఈ ధరకు పెట్టుబడులు వస్తాయి. అయితే వంద కౌంట్ ధర ప్రస్తుతం రూ.200కు పడిపోయింది. ఈ నేపథ్యంలో ఎకరాకు ఏడాదికి రూ.2 లక్షల చొప్పున నష్టం వాటిల్లే దుస్థితి ఏర్పడనుంది. అయితే ఇది ఇక్కడితో ఆగుతుందా, లేక కొనసాగుతుందా అనే ఆందోళన రైతులను వెంటాడుతోంది.

మరోపక్క విద్యుత్ బిల్లుల మోత

రొయ్యల చెరువులకు సంబంధించి విద్యుత్ వినియోగం అధికంగా ఉంటుంది. గత ప్రభుత్వం ఆక్వా జోన్ల పేరుతో విద్యుత్ రాయితీని ఆక్వా జోన్లు వరకే పరిమితం చేసింది. ఆక్వా జోన్ల వెలుపల ఉన్నవారికి విద్యుత్ రాయితీ లేకపోవడంతో విద్యుత్ బిల్లుల చెల్లింపు పెనుభారంగా మారుతోంది. నెలకు రూ.లక్షల్లో విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఫీడ్ ధరలు కూడా రైతులకు తీవ్రభారంగా మారాయి. గతంలో కూటమి ప్రభుత్వం మేత ధరలు కిలోకు రూ.4 తగ్గించినా ధరలు ఇంకా భారంగానే ఉన్నాయి. మరోమారు కనీసం కిలోకు రూ.ఆరు మేర మేత ధరలు తగ్గించాలని ఆక్వా రైతులు కోరుతున్నారు.

విద్యుత్ సబ్సిడీ ఇస్తే ఊరట..

కెజిఎఫ్.సుబ్బరాజు, జిల్లా రొయ్య రైతుల సంక్షేమ సంఘం కార్యదర్శి

ప్రస్తుతం ఆక్వా సాగు ఒడిదుడుకుల మధ్య సాగుతోంది. రైతులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. సాగు వ్యయం విపరీతంగా పెరిగింది. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న సమయంలో ట్రంప్ సుంకం విధింపు కోలుకోలేని దెబ్బతీసింది. కేవలం రెండు రోజుల్లోనే కేజీకి రూ.40 వరకూ ధర పతనమైంది. ఆక్వా జోన్లతో సంబంధం లేకుండా విద్యుత్ రాయితీని రైతులందరికీ అమలు చేయాలి. నిలకడ లేని ధరలు, పెరుగుతున్న ఖర్చులతో సాగులో నష్టాలు ఎదురవుతున్నాయి. ఇటువంటి సమయంలో విద్యుత్ సబ్సిడీపై అందిస్తే సుంకాల నుంచి రైతులకు ఊరట లభిస్తోంది.

ప్రభుత్వం ఆదుకోకపోతే మరింత నష్టం..

కట్టా నరసింహస్వామి, ఆక్వా రైతు, వీరవాసరం

సీడ్, ఫీడ్ ధరలు అధికంగా ఉన్నాయి. విద్యుత్ బిల్లుల భారం మోయలేకపోతున్నాం. లక్షలాది రూపాయలు లీజులు చెల్లించలేకపోతున్నాం. ఫీడ్, సీడ్ నాణ్యత లేకపోవడంతో దిగుబడిపై ప్రభావం పడుతోంది. లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి తీవ్రంగా నష్టపోతున్నాం. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాలతో రొయ్యల ధరలు తీవ్రంగా పతనమయ్యాయి. టన్నుకు రూ.40 వేలు నష్టపోతున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం ఆదుకోకపోతే మరింత నష్టపోవాల్సి వస్తుంది. రానున్న రోజుల్లో ఆక్వా రంగం కుదేలై నిర్వీర్యమయ్యే ప్రమాదం కూడా ఉంది.

అర్జీల పరిష్కారానికి ప్రత్యేక చొరవ
కలెక్టర్ కె.వెట్రిసెల్వి - పిజిఆర్ఎస్‌లో అందిన అర్జీలు 377

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు
పిజిఆర్ఎస్‌లో ప్రజలు సమర్పించిన అర్జీల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. ఏలూరు కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో సోమవారం జిల్లాస్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లాస్థాయి అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వితోపాటు జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, జెడ్‌పి సిఇఒ ఎం.శ్రీహరి, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి ఎం.ముక్కంటి, డిఇఒ ఎం.వెంకటలక్ష్మమ్మ, సర్వే ఎడి అన్సారీ, ఎస్‌డిసి కె.భాస్కర్ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యల పరిష్కారానికి ప్రజల నుంచి 377 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఆయా శాఖలవారీగా వచ్చిన అర్జీలను పరిశీలించి పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అర్జీల పరిష్కారంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులు, ఉద్యోగులు అంకితభావంతో పని చేయాలని సూచించారు. పిజిఆర్ఎస్‌లో ప్రజల నుంచి అందిన అర్జీల పరిష్కార సరళిపై ప్రధానంగా దృష్టి సారించాలన్నారు. అర్జీలు రీఓపెన్‌కు ఆస్కారం లేకుండా చూడాలన్నారు.

15 వరకూ హర్‌ఘర్ తిరంగా ఏర్పాట్లపై అధికారులకు కలెక్టర్ దిశా నిర్దేశం

జిల్లాలో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఈ నెల 15వ తేదీ వరకు పెద్దఎత్తున చేపట్టి ప్రజల్లో స్వాతంత్రోద్యమం పట్ల అవగాహన, దేశభక్తి భావం పెంపొందించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో హర్ ఘర్ తిరంగా క్యాంపెయిన్-2025 నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు ఆమె దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా తిరంగా ర్యాలీలు, రంగోలీ పోటీలు, దేశభక్తిని పెంపొందించే ఫొటో ఎగ్జిబిషన్లు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రతి కార్యాలయం, ఇంటిపై జాతీయజెండా ఎగురవేయడం వంటి కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లాలోని యువత, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు, స్థానిక సంస్థలు, విద్యాసంస్థల విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొనడంతోపాటు జాతీయజెండా వద్ద దిగిన సెల్ఫీలను www.harghartiranga.com వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. వివిధ ప్రభుత్వ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ద్వారా నిర్వహించే రోజువారీ కార్యక్రమాలను సంబంధిత మెయిల్ ఐడికి పంపాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా నిర్వహించే కార్యక్రమాలు విజయవంతంగా సాగేందుకు జెడ్‌పి సిఇఒ, డిఆర్‌డిఎ పీడీ, ఐసిడిఎస్ పీడీ, సెట్‌వెల్ సిఇఒ, డిఇఒ, ఆర్ఐఒ తదితర అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, జెడ్‌పి సిఇఒ ఎం.శ్రీహరి, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి ఎం.ముక్కంటి, డిఇఒ ఎం.వెంకటలక్ష్మమ్మ, ఆర్ఐఒ యోహాన్, ఐసిడిఎస్ పీడీ పి.శారద, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ పి.సాల్మన్‌రాజుతోపాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాసితుల ధర్నా

సర్వీస్ రోడ్లు, అండర్ పాస్‌లు నిర్మించాలని డిమాండ్
ప్రయివేట్ మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లించాలి
కలెక్టర్ వెట్రిసెల్వికి వినతి

కలెక్టరేట్ వద్ద నినదిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాసిత రైతులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్
ఖమ్మం నుండి దేవరపల్లి వరకూ నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవేకు సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయాలని, అండర్ పాస్ బ్రిడ్జిలు, ఉచిత బోర్లు వంటి రైతుల, ప్రజల సమస్యలు పరిష్కరించాలని, భూములు కోల్పోతున్న రైతులకు ఆర్బిటేషన్ల ద్వారా ప్రయివేట్ మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లించాలని, 2013 భూసేకరణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి భూనిర్వాసిత రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాసిత పోరాట కమిటీ, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాసిత రైతులు చలో కలెక్టరేట్, ధర్నా నిర్వహించారు. రైతులు కలెక్టరేట్ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కొద్దిసేపు వాగ్వివాదం చోటుచేసుకుంది. రైతుల పట్ల చిన్నచూపు తగదని పోలీసులపై మండిపడ్డారు. ఈ ధర్నానుద్దేశించి ఎపి రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఖమ్మం నుండి దేవరపల్లి వరకు నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవేలో రైతులు పచ్చటి సారవంతమైన భూములను కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. భూసేకరణలో రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని విమర్శించారు. మార్కెట్ విలువకు, రైతుకు ఇచ్చిన పరిహారానికి సంబంధం లేదన్నారు. గతంలో ఆర్బిటేషన్ల ద్వారా తగు న్యాయం చేస్తామని ఇచ్చిన హామీ ప్రకారం పరిహారం పెంచలేదన్నారు. హైవే నిర్మాణం పూర్తి కావొస్తుందని, జిల్లాలో చింతలపూడి, టి.నర్సాపురం, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం మండలాలు, తూర్పుగోదావరి జిల్లాలో గోపాలపురం, దేవరపల్లి మండలాల గుండా దాదాపు 31 గ్రామాల మీదుగా హైవే సాగుతుందన్నారు. ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవేకు సర్వీస్ రోడ్లు ప్రొవిజన్ లేదని చెప్పడం అన్యాయమన్నారు. రోడ్డుకు ఇరువైపులా పెద్దపెద్ద చెట్లు పెంచుతారని, వాటి బాగోగులకు అటు, ఇటు మట్టి రోడ్డు ఉంటుందని, దాన్ని గ్రావెల్ రోడ్డుగా మార్చి రైతులకు ఉపయోగకరంగా తీసుకొస్తామని గతంలో ఇచ్చిన హామీ అమలు కాలేదని చెప్పారు. అయితే ప్రస్తుతం మట్టి రోడ్డు కూడా రైతులకు అందుబాటులో లేదన్నారు. సర్వీస్ రోడ్ల ప్రొవిజన్ కల్పించకపోవడంతో చాలాచోట్ల రైతులు తమ పొలాలకు వెళ్లే మార్గాలు పూర్తిగా మూసుకుపోయాయన్నారు. పుంత రోడ్లు చాలాచోట్ల మూతపడ్డాయన్నారు. కొన్ని గ్రామాల మధ్య రహదారులు మూసుకుపోయాయని వివరించారు. దీనివల్ల రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అన్ని గ్రామాలకూ సర్వీస్ రోడ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఆర్బిట్రేషన్ల ద్వారా భూములు కోల్పోతున్న రైతులకు ప్రయివేటు మార్కెట్ విలువ ప్రకారం పరిహారం పెంచి న్యాయం చేయాలని, భూసేకరణ వల్ల రైతులే కాకుండా కౌలు రైతులు, కూలీలు, చేతివృత్తిదారులు కూడా నష్టపోతున్నారని, 2013 భూసేకరణ చట్టప్రకారం వీరికి న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాసిత రైతుల పోరాట కమిటీ నాయకులు దేవరపల్లి సత్యనారాయణ, వామిశెట్టి హరిబాబు, కె.నాగేశ్వరరావు, శీలం రామచంద్ర రావు, కొట్టు కనక నరసింహారావు, వందనపు సాయిబాబా, గోలి నర్సిరెడ్డి, కంచర్ల శ్రీనివాసరావు, ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు మాట్లాడుతూ 2022లో జిల్లా కలెక్టరేట్‌లో గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాసిత రైతుల సమస్యలపై జిల్లా కలెక్టర్ సమక్షంలో సమావేశం నిర్వహించి, అనేక హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. తగినంత ఎత్తులో అండర్ పాస్ బ్రిడ్జిల నిర్మాణం, ఉచిత బోర్లు, విద్యుత్ లైన్లు, ఉద్యాన, వ్యాపార పంటలు కోల్పోయిన వారికి తగిన పరిహారం వంటి అనేక హామీలు ఇచ్చారని, అవేమీ నెరవేరలేదన్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవేలో భూములు కోల్పోతున్న రైతులకు, హైవే నిర్మాణం వల్ల వస్తున్న సర్వీస్ రోడ్లు, అండర్ పాస్ బ్రిడ్జిల నిర్మాణం వంటి సమస్యల పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని కోరారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ రైతుల ఆందోళనకు సంఘీభావం ప్రకటించారు. ధర్నా అనంతరం కలెక్టర్ వెట్రిసెల్వికి వినతిపత్రం అందజేశారు. ఆమె సానుకూలంగా స్పందించి సమస్యలపై రైతులతో చర్చించారు. గ్రామాలవారీగా సమావేశాలు జరిపి భూనిర్వాసిత రైతుల సమస్యలు అధ్యయనం చేసి తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాసిత రైతులు గోలి సత్తిరెడ్డి, మందలపు నాగలింగం, కెవివి.సత్యనారాయణ, ఐ.ప్రదీప్‌రాజు, అందుగుల మోహన్‌రావు, ఎపి రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోన శ్రీనివాసరావు, బొడ్డు రాంబాబు, లావేటి సోంబాబు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల రద్దు కోరుతూ నేడు ధర్నాలు
ప్రజాసంఘాలు, వామపక్షాల ఆధ్వర్యాన విస్తృత ప్రచారం

నిరసన తెలుపుతున్న నేతలు, ప్రజలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్
స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని, పెంచిన కరెంటు ఛార్జీలు తగ్గించాలని కోరుతూ ప్రజాసంఘాల ఐక్య కార్యాచరణ వేదిక ఆధ్వర్యంలో సోమవారం స్థానిక వివి.నగర్ మార్కెట్ యార్డ్ ఏరియాలో ప్రజల నుంచి సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్‌డాంగే, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిఐటియు జిల్లా నాయకులు పంపన రవికుమార్ మాట్లాడుతూ మోడీ సర్కార్ విద్యుత్ సంస్కరణల చట్టం తీసుకురావడం వల్లే స్మార్ట్ మీటర్లు, విద్యుత్ రంగ ప్రయివేటీకరణ విధానాలకు కారణమన్నారు. కూటమి ప్రభుత్వం వర్తక, వాణిజ్య రంగాల్లో ఇప్పటికే స్మార్ట్ మీటర్లు బిగిస్తూ ముందుకెళ్తున్నారని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను గాలికి వదిలేస్తున్నారని విమర్శించారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 5న జిల్లా విద్యుత్ కేంద్రం వద్ద జరిగే ధర్నాకు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. వివిధ సంఘాల నాయకులు యర్రా శ్రీనివాసరావు, పుప్పాల కన్నబాబు, అడ్డగర్ల లక్ష్మి ఇందిర, అరుణకుమారి, జి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నిడమర్రు: ఎనికేపల్లి, అడవికొలను గ్రామాల్లో సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో 'పాత మీటర్లు ముద్దు, స్మార్ట్ మీటర్లు వద్దు' అంటూ విస్తృత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గవర సత్యనారాయణ, ప్రజాసంఘాల నేతలు కానూరు రాజు, సంకు శ్రీను, నిమ్మల రాంబాబు, లావేటి చంద్రరావు, నేతి దొరబాబు, కేశిరెడ్డి శ్రీను పాల్గొన్నారు.

జీలుగుమిల్లి: స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఈ నెల ఐదో తేదీన చేపట్టిన ధర్నాను జయప్రదం చేయాలని ఎపి రైతుసంఘం మండల కార్యదర్శి సిరిబత్తుల సీతారామయ్య కోరారు. సోమవారం కామయ్యపాలెంలో కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు జగదీష్, వీరేష్, సుబ్బారావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని జర్నలిస్టుల ధర్నా

ఏలూరులో కలెక్టరేట్ వద్ద నినదిస్తున్న జర్నలిస్టులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్
జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యాన సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. జర్నలిస్టు డిమాండ్స్ డే సందర్భంగా ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి, అనంతరం కలెక్టర్ వెట్రిసెల్వికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్‌డి.జబీర్, వైవి.హరీష్ మాట్లాడుతూ జిల్లాలో జర్నలిస్టులు సంవత్సరాల తరబడి అనేక సమస్యలతో బాధపడుతున్నారన్నారు. ముఖ్యంగా ఇళ్ల స్థలాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్లు మంజూరు చేయాలని, అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్లు మంజూరు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ జర్నలిస్టుల సమస్యలను తప్పకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.సోమశేఖర్, నేతలు ఎస్‌కె.బాబ్జీ, మిల్టన్ ప్రతాప్, జయరాం, సజ్జి, సిహెచ్.ప్రతాప్, నాగేశ్వరరావు, శ్యామ్‌బాబు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని ఎపిడబ్ల్యుజెఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. జర్నలిస్టు డే సందర్భంగా ఫెడరేషన్ ఆధ్వర్యాన సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా డివిజన్ కార్యదర్శి నీలా వన వెంకటేశ్వర్లు (వెంకట్) మాట్లాడారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు అలీ అబ్బాస్, సభ్యులు నాగమల్లి కుమార్, రుప్పా రామ్మోహన్‌రావు, రుద్రపాటి బాబు, రాజేంద్రప్రసాద్, డాక్టర్ కెబిఎం.రాజు, అలెన్ పాల్గొన్నారు.

రైతులకు ఎరువులు అందుబాటులోకి తేవాలి
యూరియా కొరత నివారించాలి
వైసిపి జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు

కలెక్టర్‌కు వినతిని అందజేస్తున్న వైసిపి నేతలు

ఏలూరు సిటీ : రాష్ట్రవ్యాప్తంగా రైతులకు ఎరువులను అందుబాటులోకి తెచ్చి యూరియా కొరతను వెంటనే నివారించాలని వైసిపి జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఏలూరులోని కలెక్టరేట్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా దూలం నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రైతులకు వెంటనే ఎరువులను అందుబాటులోకి తెచ్చి యూరియా కొరతను నివారించాలని డిమాండ్ చేశారు. అధికారులు అత్యవసర సమావేశాలు ఏర్పాటు చేసి గ్రామ స్థాయి వరకు ఎరువులు పంపిణీపై దృష్టి సారించాలన్నారు. ఎప్పటికప్పుడు సమాచారం తెప్పించుకుని కొరత ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో నిల్వలు ఉంచి అక్కడే రైతులకు అందజేయాలని సూచించారు. ఎరువుల బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించి బ్లాక్ మార్కెట్‌కు తరలించే వారి లైసెన్సులు రద్దు చేయాలని, వారిపై కేసులు పెట్టి అరెస్టులు చేయాలని డిమాండ్ చేశారు. ఎరువుల నిల్వలపై వ్యవసాయ శాఖ ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టి ప్రత్యేక నిఘా ఉంచాలని కోరారు. ఎరువుల నిర్వహణ రైతులు ఎప్పటికప్పుడు తెలుసుకునేలా ప్రత్యేక యాప్, లేదా వెబ్‌సైట్‌లో ఉంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వీటితోపాటు ఉచిత పంటల బీమాను అమలు చేయాలని కోరారు. కేంద్రంతో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రైతుకు ఇస్తానన్న రూ.20 వేలు చెల్లించాలని కోరారు. తొలగించిన 7 లక్షల మంది లబ్ధిదారులకు వెంటనే అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయాన్ని వారి ఖాతాల్లో వెంటనే జమ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి మేక వెంకట ప్రతాప్ అప్పారావు, చింతలపూడి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంభం విజయరాజు, నగర అధ్యక్షుడు గురుదేస్ శ్రీనివాసరావు, రాష్ట్ర ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి నూక సుధీర్ బాబు, ఏలూరు నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు జుజ్జువరపు విజయనిర్మల పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్

కార్మిక పోరాటాల పురిటి గడ్డ సిఐటియు
ఉత్సాహవంతంగా సిఐటియు 7వ మండల మహాసభ

కుక్కునూరు రూరల్ : కార్మికుల పోరాటాల గడ్డ సిఐటియు అని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ అన్నారు. సోమవారం సిఐటియు 7వ మండల మహాసభ చర్చి హాస్టల్ ఆవరణలో కాకర్ల కొమరయ్య నగర్, మధుర రాజేశ్వరి, సోడే రాములమ్మ ప్రాంగణంలో ఉత్సాహవంతంగా జరిగింది. ముందుగా కుక్కునూరు ప్రధాన సెంటర్ నుండి చర్చి హాస్టల్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సిఐటియు పతాకావిష్కరణ అధ్యక్షులు కుంజ నాగలక్ష్మి చేశారు. కుంజ నాగలక్ష్మి, బాడీస సుజాత, కాకర్ల శ్రీను అధ్యక్షతన జరిగిన ప్రతినిధుల సభలో ప్రసాద్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై నిరంతరం అలుపెరుగని పోరాటాలు చేస్తున్న ఏకైక సంఘం సిఐటియు అని కొనియాడారు. సమాన పనికి సమాన వేతనం ప్రభుత్వాలు ఇవ్వక, చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కార్మికులను ఐక్యం చేసి పోరాటాలు సిఐటియు చేస్తుందని తెలిపారు. 1970లో ప్రారంభమైన నాటి నుండి నేటి వరకు కార్మికుల సమస్యలపై ఐక్య పోరాటాలు చేస్తుందన్నారు. నేడు పాలక వర్గాలు కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ కార్మిక చట్టాలను మార్చుతూ తీవ్రమైన అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు. సిఐటియు భవిష్యత్ కార్యాచరణ కోసం ప్రతి మూడేళ్లకోసారి మహాసభలు నిర్వహిస్తుందని తెలిపారు. ఈ మహాసభలో 200 మంది కార్మికులు పాల్గొన్నారు. ఈ మహాసభలో సిఐటియు జిల్లా కార్యదర్శి మడవి దుర్గారావు, మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యర్రంశెట్టి నాగేంద్రరావు, సిఐటియు నాయకులు షేక్ వలిపాషా, పోచారపు వెంకటేశ్వర్లు, వెంకన్నబాబు, కారం రాజేశ్వరి, కారం నాగలక్ష్మి, కమల, మహమ్మద్ వలి పాషా, కారం రమేష్ పాల్గొన్నారు.

పనిచేయని ఫోన్లు మాకొద్దు బాబోయ్..

ఏలూరులో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు, నేతలు

వార్త 6లో..

పలుచోట్ల శక్తి యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి - భీమడోలు

మహిళలు, విద్యార్థినుల రక్షణ కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు రూపొందించిందని, వాటి పట్ల అవగాహన కలిగి ఉండాలని భీమడోలు ఎస్ఐ వై.సుధాకర్ కోరారు. భీమడోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు జి.వెంకట్రావు ఆధ్వర్యాన విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పట్ల సోమవారం అవగాహన కల్పించారు. శక్తి యాప్ ప్రత్యేకతలను వివరించారు. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోరారు. దీని వల్ల కలిగే నష్టాలను వివరించారు. అనంతరం శక్తి యాప్ గురించి ప్రచారం చేస్తూ విద్యార్థుల భాగస్వామ్యంతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భీమడోలు ఎఎస్ఐ చలపతిరావు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : మహిళలపై జరిగే నేరాలను అరికట్టడంలో శక్తి యాప్ ఎంతగానో దోహదపడుతుందని, ఆపత్కాలంలో శక్తి యాప్‌ను ఉపయోగించుకొని మహిళలు సత్వర సహాయం పొందాలని ఆగిరిపల్లి ఎస్ఐ కె.శుభశేఖర్ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం సైబర్ మోసాలు వాటి నివారణ, శక్తియాప్ ఉపయోగించటం, ఈవ్‌టీజింగ్, బాలికల రక్షణ, ఫేస్‌బుక్ పరిచయాలు, ఆన్‌లైన్ మోసాలపై గ్రామ మహిళా సంరక్షణాధికారులకు సోమవారం ఆగిరిపల్లి పోలీస్‌స్టేషన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామ మహిళా సంరక్షణాధికారులు పాల్గొన్నారు.

ముసునూరు : మహిళల పట్ల గుర్తుతెలియని వ్యక్తులు ఎవరైనా అసభ్యకరంగా మాట్లాడినా, వేధించినా పోలీసులకు 100కి డయల్ చేయాలని ఎస్ఐ ఎం.చిరంజీవి సూచించారు. మండలంలోని చెక్కపల్లి, ముసునూరు ప్రధాన సెంటర్ కూడలిలో మహిళలకు అవగాహన కల్పించారు.

పోలవరం : మండలంలోని పట్టిసీమ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పోలవరం పోలీసులు పోక్సో చట్టంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. సిఐ బాలసురేష్ బాబు, ఎస్ఐ పవన్ కుమార్, మహిళా పోలీస్ నాగలక్ష్మి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

నిర్ణీత సమయంలో సమస్యలు పరిష్కారం

సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్

నూజివీడు టౌన్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక(మీకోసం) కార్యక్రమంలో ప్రజలు అర్జీల ద్వారా అందించిన సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించడం జరుగుతుందని సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ తెలిపారు. నూజివీడు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. నూజివీడు రెవెన్యూ డివిజన్ పరిధిలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుండి ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సబ్ కలెక్టర్‌కు అందించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ స్మరణ్ రాజ్ మాట్లాడుతూ ప్రతి అర్జీ ఆన్‌లైన్ చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోపు అన్ని సమస్యలు పరిష్కరించడం జరుగుతుందన్నారు. రెవెన్యూ డివిజన్ పరిధిలో ప్రజలు మొత్తం 23 అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని అన్ని శాఖలకు చెందిన డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వైసిపి హయాంలో రాష్ట్రం ఇబ్బందిపాలు : ఎంఎల్ఎ

ఏలూరు సిటీ : గత వైసిపి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్లే రాష్ట్రం అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వచ్చిందని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి మండిపడ్డారు. కనీసం ప్రజాసమస్యల పరిష్కారానికి కూడా అప్పట్లో ఎటువంటి చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. ఎంఎల్ఎ బడేటి చంటి తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రజలకు అందుబాటులో ఉన్నారు. తనను కలిసేందుకు వచ్చిన వారి నుంచి వారి సమస్యలను అడిగి క్షుణ్ణంగా తెలుసుకున్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే అనేక ప్రజాసమస్యలు తిష్టవేశాయన్నారు. వాటన్నింటినీ పరిష్కరించేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నట్లు ఎంఎల్ఎ స్పష్టం చేశారు. టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మత కన్యల అరెస్ట్‌పై నిరసన

ఆగిరిపల్లి : మతమార్పిడి చేస్తున్నారనే నెపంతో రైలులో ప్రయాణిస్తున్న కన్యస్త్రీలను(మతకన్యలను) అరెస్టు చేయడం దారుణమని విద్యదాన ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్ ఫాదర్ ప్రతాప్ రెడ్డి అన్నారు. గత నెల 25న రైలులో ఇద్దరు యువతులతో ప్రయాణిస్తున్న కన్య స్త్రీలను అరెస్టు చేయటం పట్ల ఆగిరిపల్లి ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్ చర్చి పాస్టర్లు, సిస్టర్స్ సోమవారం స్కూల్ ఆవరణలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్స్ జోసెఫ్, జెఎల్.రవికుమార్, సిస్టర్స్ బిన్సీ, షార్లెట్, రితామ్మ, జెల్సీ, గౌతమి, సంతోషిని, నూతన్ ప్రియ పాల్గొన్నారు.

నా తల్లికి అన్నదాత సుఖీభవ సాయం అందలేదు

కుమార్తె నాగమల్లేశ్వరి ఆవేదన

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణం అజరయ్యపేటకు చెందిన తన తల్లి కె.మద్ది రావమ్మకు గల 50 సెంట్ల భూమికి అన్నదాత సుఖీభవ నగదు సాయం అందడం లేదని కుమార్తె నాగమల్లేశ్వరి ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు నూజివీడు సబ్ కలెక్టర్‌కు సోమవారం మీకోసంలో అర్జీ దాఖలు చేశారు. నాగమల్లేశ్వరి మాట్లాడుతూ 2005లో ప్రభుత్వం అందించిన అర ఎకరం భూమి ఆన్‌లైన్ కాలేదని, అన్నదాత సుఖీభవ నగదు అందలేదన్నారు. సమస్యను పరిష్కరించి ప్రభుత్వం నుంచి సాయం అందేలా చేయాలని కోరారు. సాంకేతిక లోపాలను పరిష్కరించి, తమకు చెందిన భూమికి అన్నదాత సుఖీభవ నగదు సాయం ప్రభుత్వం నుంచి అందేలా చర్యలు చేపట్టాలని కోరారు.

షెడ్ నిర్మాణాన్ని తొలగించాలని వినతి

జీలుగుమిల్లి : మండలంలోని వంకవారిగూడెం గ్రామంలో పాఠశాల ప్రహరీకి ఆనుకొని ఉన్న స్థలంలో శివ అనే వ్యక్తి రేకుల షెడ్ నిర్మాణం చేపడుతున్నాడు. ఈ నిర్మాణం స్థానికులకు ఇబ్బందిగా ఉందంటూ గ్రామానికి చెందిన మడకం అరుణ పంచాయతీలో ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదును పట్టించుకోకుండా నిర్మాణం చేపడుతుండటంతో స్థానిక సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు దృష్టికి తీసుకెళ్లింది. సమస్యను ఇన్‌ఛార్జి సెక్రెటరీ అశోక్‌కి తెలిపారు. స్పందించిన సెక్రెటరీ సిబ్బందితో కలిసి వెళ్లి అనుమతులు లేకుండా పాఠశాల ప్రహరీ సమీపంలో నిర్మాణాన్ని చేపట్టవద్దని నిర్మాణాన్ని ఆపాలని శివ అనే వ్యక్తికి ఆదేశించినట్లు తెలిపారు.

రైలు ఢీకొని యువకుడు మృతి

ఏలూరు స్పోర్ట్స్ : రైలు ఢీకొని వినికిడి శక్తి సరిగా లేని యువకుడు మృతి చెందిన ఘటన నూజివీడు సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. ఏలూరు రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని కృష్ణాజిల్లా బాపులపాడు మండలం వేలేరు గ్రామానికి చెందిన కృపారావు(23) స్థానికంగా తల్లిదండ్రులతో కలిసి జీవిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం బహిర్భూమికి రైలు పట్టాల వద్దకు వచ్చాడు. కృపారావుకు వినికిడి శక్తి లేకుండా బుద్ధిమాంద్యం కొంత కలిగి ఉన్నాడు. దీంతో అతను రైలు బండి వస్తున్న విషయాన్ని గ్రహించలేకపోయాడు. వేగంగా వచ్చిన రైలు బండి అతన్ని ఢీకొనడంతో అతను ఘటన స్థలంలోనే మృతిచెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఉదయాన్నే పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ దర్యాప్తు చేస్తున్నారు.

భార్యపై కత్తితో భర్త దాడి

జీలుగుమిల్లి : మద్యం మత్తులో భార్యపై భర్త కత్తితో దాడి చేయగా భార్య తలకు గాయాలైన ఘటన మండలంలోని పాలచర్ల రాజవరం గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన తెల్లం సింగరాజు అనే వ్యక్తి మద్యం మత్తులో భార్య తెల్లం లక్ష్మీతో గొడవ పడి మాట మాట పెరిగి కత్తితో ఆమెపై దాడి చేశాడు. ఈ దాడిలో ఆమె తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు ఆమెను చికిత్స నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

సోఫా దుకాణంలో అగ్ని ప్రమాదం

రూ.5 లక్షల ఆస్తినష్టం

ఏలూరు : ఏలూరు నగరంలోని సోఫా తయారు చేసే దుకాణంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగి దుకాణం పూర్తిగా దగ్ధమైన ఘటన సోమవారం తెల్లవారుజామున ఏలూరు నగరంలోని చేపల తూము సెంటర్లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు నగరంలోని కొత్తపేట చేపల తూము సెంటర్ వద్ద వీనస్ బెడ్స్ అండ్ సోఫా వర్క్స్ పేరుతో సోఫాలు, బెడ్లు తయారు చేసే దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. ఈ దుకాణ నిర్వాహకులు కూడా స్థానికంగానే నివాసం ఉంటాడు. ఆదివారం యథావిధిగా దుకాణాన్ని కట్టివేసి ఇంటికి వెళ్లిపోయిన తర్వాత తెల్లవారుజామున రెండు గంటల సమయంలో దుకాణంలో మంటలు చెలరేగాయని స్థానికులు దుకాణ నిర్వాహకులకు ఫోన్ ద్వారా సమాచారాన్ని ఇచ్చారు. అప్పటికే దుకాణం సగానికి పైగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న రెండో పట్టణ సిఐ అశోక్ కుమార్, ఎస్ఐ మధు వెంకటరాజాలు సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి వెళ్లారు. ఈ దుకాణంలో ఆస్తి నష్టం ఐదు లక్షల వరకు ఉంటుందని ఫైర్ ఆఫీసర్ రామకృష్ణ తెలిపారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పనిచేయని ఫోన్లు మాకొద్దు బాబోయ్..

ఐసిడిఎస్ కార్యాలయాల వద్ద ధర్నాలో అంగన్వాడీలు

చింతలపూడిలో నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పనిచేయని స్మార్ట్ ఫోన్లతో తాము ఆన్‌లైన్‌లో డేటా వివరాలు నమోదు చేయలేక పోతున్నామని వాపోతూ అంగన్వాడీ టీచర్స్ ప్రభుత్వం ఇచ్చిన సెల్ ఫోన్లు ఐసిడిఎస్ కార్యాలయంలో తిరిగి ఇచ్చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియం వెనుక ఉన్న ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఓల్డ్ వెర్షన్ స్మార్ట్ ఫోన్లో నూతన టెక్నాలజీ యాప్‌లు తమ పనికి ఉపయోగపడటం లేదనీ, 5జి టెక్నాలజీ యాప్‌లు ఓల్డ్ వెర్షన్ ఫోన్లో ఎలా అప్లోడ్ చెయ్యాలో చెప్పాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏలూరు ప్రాజెక్ట్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు షేక్ సమీమా, తలారి రజని మాట్లాడుతూ ప్రభుత్వం నూతన వెర్షన్ ఫోన్లు ఇచ్చే వరకు మాన్యువల్ పద్ధతిలోనే పని చేస్తామన్నారు. రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు తాము ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. సిగ్నల్స్ ఇబ్బందులకు వర్కర్స్ బాధ్యత వహించరని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో సిఐటియు నాయకులు పంపన రవికుమార్, ఎం.ఇస్సాక్, పిల్లి వీరబాబు పాల్గొన్నారు.

చింతలపూడి : అంగన్వాడీ సెంటర్ నిర్వహణకు ఇచ్చిన ఫోన్లు పోషణ ట్రాక్టర్, బాలసంజీవని యాప్స్ అమలుకు సపోర్ట్ చేయటం లేదని యూనియన్ సిఐటియు ప్రాజెక్టు అధ్యక్షులు సరోజ, కార్యదర్శి సరళ అన్నారు. టి.నర్సాపురం, చింతలపూడి, లింగపాలెం మండలాల్లో అంగన్వాడీ టీచర్స్ అండ్ వర్కర్స్ తమ ఫోన్లను సిడిపిఒకి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫోన్‌లు అన్నీ ఈనెల 4న సిడిపిఒ కార్యాలయంలో అందజేశామని, 5 నుంచి ఆన్‌లైన్ వర్క్ చేయలేమన్నారు. సెంటర్లో హాజరు, లబ్ధిదారుల ఆహారం, సరుకుల పంపిణీ మొత్తం రికార్డులో రాస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో మణి, కవిత, వెంకమ్మ సిఐటియు మండల అధ్యక్షుడు నత్తా వెంకటేశ్వరావు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ముదినేపల్లి : పనిచేయని ఈ సెల్ ఫోన్లు మాకు వద్దు అంటూ అంగన్వాడీ కార్యకర్తలు సోమవారం ఐసిడిఎస్ అధికారులకు తమ సెల్ ఫోన్లను అప్పగించారు. మండలంలో 90 అంగన్వాడీ కేంద్రాలకు చెందిన కార్యకర్తలు కైకలూరులోని ఐసిడిఎస్ కార్యాలయంలో తమ సెల్‌ఫోన్లను ఆయా సెక్టార్ల సూపర్‌వైజర్లకు అప్పగించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు బండి పద్మ, అరుణ కుమారి, పాము సరస్వతి, భాగ్యలక్ష్మి, రిబ్కా పాల్గొన్నారు.

మండవల్లి : సెల్ ఫోన్లు సరిగ్గా పనిచేయక, యాప్‌లో వర్క్ చేయలేక మానసిక ఒత్తిడికి గురవుతున్నామని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు కె.చెల్లమ్మ స్పష్టం చేశారు. మండవల్లి సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలకు ప్రభుత్వం అందించిన సెల్ ఫోన్‌లను ఆయా సెక్టార్ల సూపర్‌వైజర్లకు అందించి నిరసన తెలిపారు.

బిడ్డ ఆరోగ్య పరిరక్షణలో తల్లిపాలు కీలకం

నాలుగో రోజు కొనసాగిన తల్లిపాల వారోత్సవాలు

ఏలూరు సిటీలో మాట్లాడుతున్న ఐసిడిఎస్ అధికారి పద్మావతి

ముదినేపల్లిలో..

ప్రజాశక్తి - భీమడోలు

తల్లిపాలు బిడ్డలకు అమృతంతో సమానమని, వారి ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తాయని ఐసిడిఎస్ భీమడోలు ప్రాజెక్ట్, భీమడోలు సెక్టార్ పర్యవేక్షకులు రూపా దేవి అన్నారు. ప్రాజెక్టు పరిధిలో కొనసాగుతున్న తల్లిపాల వారోత్సవాలు సోమవారంతో నాలుగవ రోజుకు చేరాయి. దీనిలో భాగంగా భీమడోలుకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు భీమడోలు ప్రాథమిక పాఠశాల నెంబర్ వన్ ఆవరణ వేదికగా తల్లిపాల వారోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యత గురించి గర్భిణులకు, తల్లులకు తెలియజేశారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు స్వర్ణకుమారి పాల్గొన్నారు.

ఏలూరు సిటీ : ఏలూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని వైఎస్ఆర్ కాలనీ అంగన్వాడీ కేంద్రంలో సోమవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి ఎ.పద్మావతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డకు తల్లిపాలు ఏ విధంగా ఇవ్వాలో తెలియజేశారు. తల్లిపాలు బిడ్డ హక్కు అని, బిడ్డకి తొలి టీకా అని కూడా తెలిపారు. తల్లిపాలు బిడ్డకు ఇవ్వడం వల్ల తల్లికి కలిగే లాభాలను, తల్లిపాలు బిడ్డ తాగడం వల్ల బిడ్డకు కలిగే లాభాల గురించి తల్లులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జోషి, మహిళా సంరక్షణ కార్యదర్శి అపర్ణ, అంగన్వాడీలు పాల్గొన్నారు.

ముదినేపల్లి : తల్లిపాలతోనే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని ముదినేపల్లి ఐసిడిఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి అన్నారు. మండలంలోని పెయ్యేరు, ముదినేపల్లి గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సూపర్‌వైజర్ విజయలక్ష్మి మాట్లాడుతూ తల్లిపాలు శ్రేష్టమని, వీటిని తాగడం వల్ల బాలలకు ఎలాంటి ప్రాణాంతక వ్యాధులు దరిచేరవని చెప్పారు. ప్రతి తల్లి తన పాలను పుట్టిన అరగంటలోపే బిడ్డకు పట్టాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పి.సరస్వతి, బండి పద్మ, ఆశా వర్కర్లు, ఆయా ప్రశాంతి పాల్గొన్నారు.

మండవల్లి : ముర్రిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యమని సిడిపిఒ దీప్తి స్పష్టం చేశారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా లింగాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముర్రిపాలలో మహత్తరమైన శక్తి ఉందని అవి వ్యాధి నిరోధక శక్తిని కలిగి ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగలక్ష్మి, ఎఎన్ఎం, అంగన్వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : తల్లి పాలు బిడ్డలకు తల్లి ఇచ్చే మొదటి టీకా అని ముర్రు పాలు ఇవ్వడం వల్ల బిడ్డల్లో కామెర్లు రాకుండా నివారించవచ్చునని, తల్లిపాలు పుట్టిన బిడ్డలకు ఆరునెలల పాటు ఇవ్వడం వల్ల రోగ నిరోధక శక్తి పెంపొందుతుందని నూజివీడు సిడిపిఒ పి.విజయకుమారి అన్నారు. ఆగిరిపల్లి మెయిన్ స్కూల్‌లోని అంగన్వాడీ కేంద్రంలో తల్లులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడీ సూపర్‌వైజర్ జి.రాగమయి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇ-పంట నమోదుపై అవగాహన

పోలవరం : ఇ-పంట నమోదుపై మండల వ్యవసాయశాఖాధికారి కె.రాంబాబు ఆధ్వర్యాన స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామస్థాయి రైతు సేవా కేంద్రం సిబ్బందికి ఖరీఫ్ 2025 సీజన్‌కి సంబంధించి ఇ-పంట నమోదుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ ఇ-పంట నమోదు జియో కో ఆర్డినేట్స్ ద్వారా సాటిలైట్ ఆధారంగా నమోదు కార్యక్రమం జరుగుతుందని, సర్వే ఆధారంగా పంట నమోదు వివరాలు పూర్తి చేయాలని తెలిపారు. తహశీల్దార్ సాయిరాజు, డిటి కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీల వినతి

నూజివీడు టౌన్ : మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం పనులు చేయగా గడచిన 14 వారాలుగా వేతనాలు ఇవ్వలేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని సుంకొల్లు గ్రామానికి చెందిన ఉపాధి హామీ కార్మికులు సోమవారం సబ్ కలెక్టర్‌కు ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం అనే కార్యక్రమంలో ఈమేరకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడుతూ గడచిన 14 వారాలుగా పనులు చేస్తే వేతనాలు ఇవ్వలేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పనులకు రాని వ్యక్తులు, ఇంటి నుండి బయటకు వెళ్లని వారికి ఉపాధి హామీ పనులు చేసినట్లు నగదు పంపిణీ చేశారని ఆధారాలతో సహా చూపించారు. బకాయి పడిన వేతనాలు ఇచ్చేవరకు ఆందోళన చేస్తామని స్పష్టం చేశారు.

వేల్పుచర్ల సర్పంచి చెక్ పవర్ రద్దు

ముసునూరు : వేల్పుచర్ల గ్రామ పంచాయతీ సర్పంచి చెక్ పవర్ రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి కె.అనురాధ ఉత్తర్వులు జారీ చేశారని ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణ అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో మండలంలోని వేల్పుచర్ల గ్రామ పంచాయతీ నిధులు వినియోగంలో అవకతవకలు జరగడంతో గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు గతంలో ఫిర్యాదు చేయడంతో విచారించి రద్దు చేసినట్లు తెలిపారు.

వ్యవసాయ రంగంలో కార్మికుల పాత్ర ఎనలేనిది

సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ

ప్రజాశక్తి - లింగపాలెం

వ్యవసాయ రంగంలో రైతులతో పాటు వ్యవసాయ కార్మికులు జోడెద్దులాంటి వారని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని ధర్మాజీగూడెంలో సివిల్ సప్లై గోడౌన్ వద్ద వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా క్లాసుల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా రాజకీయ శిక్షణ తరగతులు ఈనెల 10, 11, 12 తేదీల్లో మండలంలోని ధర్మాజీగూడెంలో జరుగుతున్నాయని తెలిపారు. వ్యవసాయ కార్మికులు వ్యవసాయ రంగంలో సంపద సృష్టించడంలో కీలకపాత్ర పోషిస్తున్న సంగతి అందరికి తెలిసిందే అన్నారు. రైతులు, వ్యవసాయ కార్మికుల శ్రమ వల్లే సామాన్యుని నుండి దేశ ప్రధాని వరకూ ఐదు వేళ్లు నోట్లోకి వెళ్తున్నాయని తెలిపారు. వారి సమస్యలపై నిరంతరం పనిచేసే సంఘం రాజకీయ శిక్షణ తరగతులు జయప్రదం చేయాలన్నారు. ఈ రాజకీయ శిక్షణ తరగతులకు విద్యావేత్తలు, మేధావులు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఉపాధి హామీ చట్టం అమలులో సంఘం కీలక పాత్ర పోషిస్తుందని, భూమి, ఇళ్ల స్థలాల సమస్యలపై ఇప్పటికే పేదలు, దళితులు, గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యలపై ఈ తరగతులలో చర్చించడం జరుగుతుందని తెలిపారు. ఈ తరగతులకు జిల్లా వ్యాప్తంగా 150 మంది ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు తామా ముత్యాలమ్మ, అశోక్, రాజశేఖర్, రాంబాబు, హుస్సేన్ పాల్గొన్నారు.

జాగ్రుతి పథకం పట్ల అవగానుండాలి

ఉమ్మడి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్

భీమడోలు : న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న జాగృతి పథకం పట్ల అవగాహన కలిగి ఉండాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ కోరారు. సోమవారం ఆయన భీమడోలులో పర్యటించారు. ఈ సందర్భంగా భీమడోలు మండల సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటుచేసిన జాగృతి పథకం అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడుతూ జాగృతి పథకం ద్వారా ఉచిత న్యాయ, సంక్షేమ పథకాలు అర్హులకు అందుతాయన్నారు. అర్హులు ఎవరికైనా అవి చేరకుంటే న్యాయ సేవ సాధికారిక సంస్థను సంప్రదించాలని కోరారు. ఇదేక్రమంలో బాధితులకు ఉచిత న్యాయ సహాయంతో పాటు తాత్కాలిక, శాశ్వత పరిహారాలు చేరతాయన్నారు. పనిచేసే మహిళలకు ఎదురయ్యే సమస్యల పరిష్కారం, రక్షణ కోసం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యాన ఒక కమిటీ పని చేస్తుందని తెలిపారు. అనంతరం పొలసానిపల్లిలోని బిఆర్.అంబేద్కర్ గురుకులం(బాలికలు) పాఠశాల, జూనియర్ కళాశాలను సందర్శించి, తనిఖీ చేశారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి సూర్యచక్రవేణి, డిప్యూటీ తహశీల్దార్ రంగ లక్ష్మి, వెలుగు కార్యాలయ ఎపిఎం రత్నకుమారి పాల్గొన్నారు.

పేదరికం లేని సమాజ స్థాపనకు సహకరిస్తా

నితిన్‌కృష్ణ కన్‌స్ట్రక్షన్స్ అధినేత కొలుసు నితిన్‌కృష్ణ

ఆగిరిపల్లి : రాష్ట్రంలో పేదరికం లేని సమాజ స్థాపనకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పానికి మార్గదర్శకులుగా తాము పూర్తిగా సహకరిస్తామని నితిన్‌కృష్ణ కన్‌స్ట్రక్షన్స్ అధినేత కొలుసు నితిన్‌కృష్ణ అన్నారు. సోమవారం మండల పరిధిలోని అమ్మవారిగూడెం గ్రామంలో తాను దత్తత తీసుకొన్న కుటుంబాలను కలుసుకొని వారి ఆర్థికాభివృద్ధికి వారు కోరుకున్న సుమారు రూ.10 లక్షల విలువ చేసే పాడి పశువులు, తోపుడుబళ్లు, సైకిల్స్, కుట్టుమిషన్‌లను ఆయన బంగారు కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పి-4 కార్యక్రమాన్ని నూజివీడు నియోజకవర్గంలోని ఆగిరిపల్లిలో లాంఛనంగా ప్రారంభించారని, ఫేస్-1గా మొదటి విడతలో 10 కుటుంబాలకు ఇంటింటికి వెళ్లి వారి ఆర్థికాభివృద్ధికి ఉపకరణాలను అందజేయడం జరిగిందన్నారు. మండల పరిధిలోని తోటపల్లి గ్రామంలో బయోగ్యాస్ ప్లాంట్ పరిశ్రమను స్థాపించి, స్థానికంగా 600 మంది యువతకు ఉద్యోగావకాశాలను కల్పించడం జరుగుతుందన్నారు. సమాజంలో ఆర్థిక అసమానతలను తొలగించేందుకు పి-4 కార్యక్రమం మంచి వేదిక అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఇఒ, నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఎం.శ్రీహరి, తహశీల్దార్ పిఎన్‌వి.ప్రసాద్, ఎంపిడిఒ బి.భార్గవి, టిడిపి మండల అధ్యక్షులు ఎన్.వేణు, టిడిపి నాయకులు ఎ.శ్రీనివాసరావు, పి.నరశింహరావు, జోజిబాబు, బి.రాజగోపాల్, ఎం.వేణు, సర్పంచిలు, మండల స్థాయి నాయకులు, బంగారు కుటుంబాల లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్రీసుగుణలో 200 మందికి వైద్య పరీక్షలు

కలిదిండి : స్థానిక శ్రీసుగుణ జూనియర్, డిగ్రీ కళాశాలలో సుగుణ విద్యా సంస్థల వ్యవస్థాపకులు కారి హరినాథ్ జ్ఞాపకార్థం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సంస్థ అధినేత కారి రాజమణి మాట్లాడుతూ హరినాథ్ ఆశయాలను నెరవేర్చేలా పలు సేవా కార్యక్రమాలతో పాటు వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వైద్యులు తన్మయి సుగుణ, సుజన్మయి సుగుణ వైద్య పరీక్షలు నిర్వహించగా ప్రిన్సిపల్ టి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

IN THE COURT OF THE Ist ADDITIONAL JUNIOR CIVIL JUDGE : BHIMAVARAM

E.A.No.41/2025 in E.P.No.37/2024

Between :

Raja Veera Venkata Satyanrayana ...Petitioner/DHr

And

Krovvidi Manindar ...Respondent/JDr

NAME AND ADDRESS OF THE REPONDENT:

Krovvidi Manindar, S/o.Late Kishore, D.No.9-54, Beside Post Office, Srungavruksham, Palakoderu Mandal, W.G.Dist. Cell: 9100143444.

పై పిటీషనరు మీపై తనఖా బాకీ రాబట్టుకొనుటకు, దాఖలు చేసిన పై పిటీషన్‌లో మీరు నోటీసులు తీసుకొనకుండుటచే పత్రికా ప్రకటన ద్వారా మీకు నోటీసు ఇవ్వబడుచున్నది. మీరు పై కోర్టు వారి ఎదుట **ది.25-8-2025వ సంగరం తేదీన ఉదయం 10 గంగ 30 నిగలకు** హాజరు అయ్యి మీ వాదన తెలియజేసుకొనవలెను. లేని ఎడల మీ పరోక్షంలో ఉత్తర్వులు జారి చేయబడును.

Vundavalli Satyanarayana Murthy
B.Com., I.R.P.M., B.L.
Advocate for D.Hr
Opp. D.N.R. College
Bhimavaram - 1.

Bhimavaram
Dt.4-8-2025

IN THE HONOURABLE COURT OF THE 1st. ADDL.SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
E.A.263/2024 in E.P. 174/2005 in O.S. 79/1975

Between:
Smt. Vuppala Lakshmi Devi (Died) & another ... Petitioner/Dhr
And:
J.S.M.Prasad (Died) & others . . . Respondents/Jdrs

E.A. NOTICE IN ORDER 22. R.9 OF C.P.C

R-3: Kasi Visweswara Rao, S/o. Seshayya, College Principal Vuyyuru, W.G.Dist.
R-8: Kuna Suryanarayana, S/o. Apparao R/at. Tanuku, W.G.Dist.

Whereas the above decree holder has instituted the above E.A.263/24 under 0.22.R.9 of CPC to setaside the order of abatement came in to existence by 28-8-11 for non filing of application under O.22 R.3 C.P.C. to add him as the 2nd DHr in the above E.P.174/05. The said E.A.263/24 stands posted to **20-8-2025** in the above Court.

You are hereby summoned to appear in the above Court in person or by a pleader on **20-08-2025 at 10.30 A.M.** to answer the same failing which the E.A.263/24 will be decided in your absence and disposed exparte.

DATE OF HEARING: 20-08-2025
Y.SUJATHA
P.MURALI GOPAL
Advocates, D.No. 49-19-20, Lalitha Nagar, Visakhapatnam.

IN THE HONOURABLE COURT OF THE 1st. ADDL.SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
E.A.243/2024 in E.P. 174/2005 in O.S. 79/1975

Between:
Smt. Vuppala Lakshmi Devi (Died) & another ..Petitioner/Dhr
And:
J.S.M.Prasad (Died) & others ...Respondents/Jdrs

E.A. NOTICE (SEC.5 OF LIMITATION ACT)

R-3: Kasi Visweswara Rao, S/o. Seshayya, College Principal Vuyyuru, W.G.Dist.
R-8: Kuna Suryanarayana, S/o. Apparao R/at. Tanuku, W.G.Dist.

Whereas the above decree holder has instituted the above E.A.243/24 under Sec. 5 of Limitation Act to condone delay of 1739 days to setaside the above E.P.174/05. The said E.A.174/05. The E.A.243/24 stands posted to **20-8-2025** in the above Court.

You are hereby summoned to appear in the above Court in person or by a pleader on **20-08-2025 at 10.30 A.M.** to answer the same failing which the E.A.243/24 will be decided in your absence and disposed exparte.

DATE OF HEARING: 20-08-2025
Y.SUJATHA
P.MURALI GOPAL
Advocates, D.No. 49-19-20, Lalitha Nagar, Visakhapatnam.

చింతలపూడిలో ఆర్‌టిసి బస్ డిపో ఏర్పాటు చేయాలి : ఎంఎల్ఎ



వినతిని అందజేస్తున్న ఎంఎల్ఎ రోషన్

చింతలపూడి: చింతలపూడిలో ఆర్‌టిసి బస్ డిపో ఏర్పాటు చేయాలని కోరుతూ చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్ విజయవాడలో ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.విజయ రత్నంను కలసి వినతి పత్రం సమర్పించారు. అందుకు అవసరమైన నివేదిక రూపొందిస్తామని ఇడి విజయరత్నం సానుకూలతను వ్యక్తం చేసినట్లు తెలిపారు.

యూనిఫామ్, బుక్స్ పంపిణీ

ద్వారకాతిరుమల : ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీవెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం ద్వారకాతిరుమల ఆధ్వర్యాన నడుపుతున్న సంస్కృత ఉన్నత పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు యూనిఫామ్‌లు, బ్యాగ్‌లు పంపిణీ చేశారు. హైదరాబాద్ వాస్తవ్యులు కందాడై శ్రీనివాస చారి, ఉండ్రాజవరం వాస్తవ్యులు మల్లెన శేషగిరిరావు సహకారంతో అందజేసినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.

IN THE HONOURABLE COURT OF THE 1st. ADDL.SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
E.A.262/2024 in E.P. 174/2005 in O.S. 79/1975

Between:
Smt. Vuppala Lakshmi Devi (Died) & another ..Petitioner/Dhr
And:
J.S.M.Prasad (Died) & others . . . Respondents/Jdrs

E.A. NOTICE UNDER ORDER 21. R.106 OF C.P.C

R-3: Kasi Visweswara Rao, S/o. Seshayya, College Principal Vuyyuru, W.G.Dist.
R-5: Kuna Suryanarayana, S/o. Apparao R/at. Tanuku, W.G.Dist.

Whereas the above decree holder has instituted the above E.A.262/24 under 0.21.R.106 of CPC to setaside the dismissal/default order dated **08-02-2019** in the above E.P.174/05. The said E.A. 262/24 stands posted to **20-8-2025** in the above Court.

You are hereby summoned to appear in the above Court in persen or by a pleader on **20-08-2025 at 10.30 A.M.** to answer the same failing which the E.A.262/24 will be decided in your absence and disposed exparte.

DATE OF HEARING: 20-08-2025
Y.SUJATHA
P.MURALI GOPAL
Advocates, D.No. 49-19-20, Lalitha Nagar, Visakhapatnam.

మహారాజశ్రీ 3వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్), ఏలూరు వారి కోర్టులో

ఒ.ఎస్.నెం.518/2023

మధ్య :
శ్రీమతి గాడు వెంకట పద్మావతి ...వాది
మరియు
శ్రీ కాళ్ళ వీర వెంకట సత్య ఆది వరప్రసాద్ అలియాస్ ప్రసాద్ ...ప్రతివాది

నోటీసు

ప్రతివాదినకు :
శ్రీ కాళ్ళ వీర వెంకట సత్య ఆది వరప్రసాద్ అలియాస్ ప్రసాద్, నివాసం : ఫ్లాట్ నెం.101, డోరునెం.8-7-4/1, శ్రీ వినాయక హైట్స్, ఆర్.టి.సి. డిపో వెనుక, కూర్మయ్య పేట, భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా.

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు కోర్టు వారు నోటీసును ఈ పత్రిక ద్వారా ఆర్డరు వేసినారు. కాబట్టి సదరు దావా వాయిదా రోజున అనగా **ది.21-08-2025వ తేదీన ఉదయం గం.10.30 ని.లకు** పైకోర్టు వారి యెదుట స్వయంగా హాజరై మీకేవైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనగలరు. లేనియెడల మీ పరోక్షములో పై నెంబరు దావా తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియపరచడమైనది.

యం.జి.బి.మురళి
ఏలూరు, అడ్వకేట్, ఏలూరు.
తేది.01-08-2025 సెల్: 6281943636.

ప్రకటన

మహారాజశ్రీ నర్సాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

SUCCESSION O.P.No.1/2025

Between :
1.వరదా కోటేశ్వరరావు
2.వరదా జగన్నాథ్
3.సారా రాజ్యలక్ష్మి
4.వరదా లీలావద్మ అనే వాసా లీలావద్మ
(ది 1వ పిటిషనరు రిప్రజెంటింగ్ 2 to 4వ రెస్పాండెంట్లు యొక్క G.P.A. Holder గా వ్యవహరించుచుండిన G.P.A.No.35/2021 తేదీ.1-9-2021 ద్వారానున్నారు.
...పిటీషనర్లు
Vs
Nil ...రెస్పాండెంట్లు

పై నెంబరు Succession O.P.No.1/2025 లో 1వ పిటిషనరు (లేటు) వరదా కోట శివరాజు గారి కుమారుడున్నారు. 2వ పిటిషనరు గారి కొడుకు మూడు, నాలుగు పిటిషనర్లు 1వ పిటిషనరు యొక్క సోదరీమణులైయున్నారు. (లేటు) వరదా కోట శివరాజు గారు ఈ కేసులోని ఆస్తుల యజమానులు కేసిదారా ది.15-7-2021 సం తేదీన మరణించినారు. వారికి 1వ వారు, 2 to 4 పిటిషనర్లు వారసులుగా ఉన్నారు. మాతరవు 1వ పిటిషనరు గార్లు ఏజెంటుగా నియమించి వారి పేరున జనరల్ పవర్ అఫ్ అటార్నీ వ్రాయించి సదరు GPA లో పొందుపరచిన అంశాలను కొత్త మంది చేయుటకున్నారు. (ప్రాపర్టీ) అస్తులు భద్రపరచు నిమిత్తం గారి కొంత మంది రక్షిస్తున్న ధనము డిపాజిట్ రీత్యా చేయబడియున్న వసూలు చేయుటకున్నారు పాలకొల్లు (ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) O.S.No.32/2024 లో వరదా కోట శివరాజు గారి వద్ద నుండి కడియం వెంకట సత్యనారాయణ గారి వారి అనే పల్లాల అప్పుగా తీసుకొన్న ప్రామిసరీ నోట్లు, ఒకటి ది.21-1-2021 రూ.1,25,000/- అక్షరాల ఒక లక్ష ఇరవై అయిదు వేల రూపాయలు, రెండవది ది.6-3-2021 రూ.1,50,000/- అక్షరాల ఒక లక్షయాభై వేల రూపాయలు బాకీలు వసూలు చేయు నిమిత్తం ఈ G.P.A ప్రకారం వారసులు డిక్రీ చేసి Succession Certificate ఇప్పించగలరని కోరుచూ పిటిషనర్లు పైకోర్టులో Succession O.P.No.1/2025 అను పిటిషను దాఖలు చేసియున్నారు.

సదరు పిటిషనుపై ఎవరికైనా ఏమైనా అభ్యంతరములు ఉన్నయెడల ది.18-8-2025 సంగతేదీన ఉదయం 10.30 నిగలకు పైకోర్టు వారి యెదుట హాజరై అభ్యంతరములను సదరు గౌరవనీయులైన కోర్టు వారి సమక్షములో దాఖలు చేయవలెను. లేనియెడల శ్రీకోర్టు వారు మీ పరోక్షము నందు పై నెంబరు కేసులో తీర్పునిచ్చెదరు.

కోమాటి వెంకటేశ్వరరావు
నర్సాపురం, అడ్వకేటు, నర్సాపురం.
ది.18-8-2025 సెల్: 9441750937